# స్వేచ్ఛా జీవులు

"పల్లెటూళ్ళో పాత ఇల్లు అమ్మినా సరే పట్నంలో కొత్త ప్లాటు కొనాలని పట్టుబట్టిందిరా మీ చెల్లాయి" ఖాళీ చేసిన చాయకప్పును టీపాయ్ మీదుంచుతున్న గోపాల్ చలాకీ చూపులు రజని మీద వాలాయి.

రజని చూపులు ఆటోమేటిగ్గా నావైపు మళ్ళాయి. ముద్దబంతి పూవు లాంటి మొహం కాసింత ముడుచుకు పోయింది

"చుశావా అన్నయ్యా! అసలీ ప్లానంతా ఆయనది. నాది ఆమోదం మాత్రమే" తనమీద నింద పడబోతుందని భయమేసిందేమో. నేలకేసి కొట్టిన బంతిలా దిగ్గున లేచింది. ఖాళీ కప్పులందుకుని వంటిట్లోకెల్తూ.

"ఎప్పుడో పుట్టబోయే పిల్లల చదువుల కోసం ఇప్పుడే సెటిలైపోదామని పోరు బెడ్తున్నారన్నయ్యా!" గోముగా అని గోపాల్‌వైపు చూసింది. గోపాల్ మందహాసానికి జవాబుగా మెత్తగా నవ్వింది.

గోపాల్ నా ప్రాణస్నేహితుడు. రజని మా బాబాయి కూతురు. రక్తం పంచుకు పుట్టకపోయినా నా గుండెల మీదాడుకుంది కాబట్టి నేనంటే ప్రాణం. నా దగ్గరే ఉండి చదువుకుంది. కాబట్టి ఆవిడ నా ఆరోప్రాణం. నా కోసం వచ్చీ వచ్చి నా చెల్లిని సొంతం చేసుకున్న గోపాల్ గత జన్మలో భూపాలుడేమో. ఈ జన్మలో రాజకీయాల్లోకి దిగబోయి, జారిపోయి కాళ్ళూ చేతులు విరగ్గొట్టుకున్నాడు. పైరవీల అనుభవాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ రంగములో గుమాస్తా ఉద్యోగం సంపాదించగలిగాడు.

"పెళ్లి చేసుకొని ఇల్లు చూసుకొని హాయిగా కాలం గడపాలోయ్..." పాట బుర్రలో అదే పనిగా గిరికీలు కొట్టింది కాబోలు... అయిన వాళ్ళనెదిరించి రజని మెడలో మూడు ముళ్ళేశాడు. పెళ్ళై మూడేళ్ళుగూడా దాటలేదు. 'పట్నంలో సొంతిల్లు' పథకం వైపు మనసు మళ్ళింది. ముందు ప్లాటు కొనాలని ప్లానేశాడు. బ్రహ్మచారిగా బ్రతికినప్పుడు పెంచిన బాంక్ బాలెన్స్ నిల్ చేసేసి నెల రోజుల క్రితమే అడ్వాన్సిచ్చాడు.

పుట్టీ పెరిగిన ఊళ్ళోని పాత ఇల్లు అమ్మి డబ్బు పట్టుకొచ్చాననీ, దాంతో ఈ రోజే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనీ, తన తంటాల వెంట నేనుండి తీరాలనీ గంట క్రితమే ఫోన్ చేశాడు. ఇంకేముంది! రెక్కలు కట్టుకు వచ్చివాలాను.

"సంసారమనే బండికి భార్యా భర్తలు రెండు చక్రాలు గదరా! మీరిద్దరూ అంతే" కబుర్లతో కాలక్షేపం చెయ్యడం నాకిష్టం లేదు. "ముందు రిజిస్ట్రేషన్ పనిమీద వెళ్దాం పద! ఆ తర్వాత ఇంట్లో కూచుండి మాటల మూటల్లో ప్రపంచాన్ని బంధించవచ్చు" లేచి నుంచున్నాను.

"సరేపద!" తానూ లేచి "రజనీ! భీరువాలోంచి ఆ క్యాష బ్యాగిలా పట్రా!" ఆర్డరు జారీ చేశాడు. అలవోకగా బూట్లందుకుని సాక్సు వేసుకున్నాడు.



ఐతా చంద్రయ్య

"బ్యాగు బీరువాలో కన్పించడం లేదండీ!" ఖాళీ చేతుల్తో కాళ్ళీడ్చుకుంటూ బయటికొచ్చింది రజని. "ధనం దాచిన వారికే తెలుస్తుందన్నారందుకే," చిరుకోపంతో అడుగులు పడుతున్నాయోమో పట్టా గొలుసుల చిరునవ్వుల సవ్వడి విన్పిస్తూంది. "ఎక్కడ పెట్టారో చెప్పండి."

తొడుక్కోబోతున్న బూట్లను పక్కకు తోసేశాడు. నోరు చిత్రగుప్తుని చిట్టాలా తెరుచుకుంది.

"నాకేం దెల్సు! అలవాటు ప్రకారం బ్యాగుదెచ్చి భార్య చేతుల్లో ఉంచానుగదా! ఈ మధ్య మతి మరుపు మహారాణివై పోతున్నావోయ్!" గొప్ప జోకేశాననుకొని నవ్వబోయాడు.

"అయ్యోరామ! గతిలేని సంసారం చెయ్యొచ్చుగానీ మతిలేని మొగునితో వేగలేను బాబూ! మతి మరుపు మీదా, నాదా?" రాణి రుద్రమలా కొంగు బొడ్లో దోపుకుంది. మూడురాళ్ళ ముక్కుపుడక త్రివర్ణ పతాకంలా వెలిగిపోతోంది.

"రైలుదిగి నేరుగా ఆఫీసు కెళ్ళారు. ఇంటికి మాత్రం చేతులూపుకుంటూ వచ్చారు. క్యాషుబ్యాగు ఆఫీసు బీరువాలో ఉంచుంటారు. అర్జంట్‌గా వెళ్ళి ఐదునిమిషాల్లో పట్టుకురండి"

ఓట్ల లెక్కింపు పూర్తవకముందే ఓటమి అంగీకరించిన అభ్యర్థిలా గోపాల్ బుర్ర గోక్కున్నాడు. సవరించిన చూపులు సీలింగ్ ఫ్యాన్‌మీదున్నై.

"లేదు రజనీ ఆఫీసు బీరు తాళం గూడా తియ్యలేదు. ఊరునుంచి రైల్లో వచ్చి నేరుగా ఆఫీసుకెళ్ళిన మాట నిజమే..." కుడిచేతి చూపుడు వేలు పెదాల మీద కొట్టుకుంటూంది. ఆలోచనలో పడిపోయాడన్నమాట. "కానీ... కాని లీవు లెటరూ, బీరువా తాళాలు మా ఆఫీసరుకు హాండోవర్ చేసి ఇంటికొచ్చానంతే." జుట్టు పీక్కుంటున్నాడు - సన్నకారు పిచ్చివాడిలా.

ఆత్మీయులెవరో హఠత్తుగా చనిపోయినట్టు "అమ్మో...వామ్మో..." గుండెలు బాదుకుంది. రజని.

"మరీ... మరా క్యాషు బ్యాగేమయినట్టండీ?"

"డడ... డబ్బు...బబ..బ్యా...గూ ఇంటికి తేలేదా?"

"తేలేదని తెలుగులోనే చెప్పాను గదా!"

"మ్మ...మరీ ఏ....య్యేమై...నట్టూ....!" గుడ్లు తేలేశాడు.

"ఆc...ఆc..." లబోదిబో మంది.

"ఒకటా రెండా! యాభైవేల రూపాయలు" రజని కనుగుడ్లు కోడి గుడ్లలాగైపోయినై. భర్తను ఎగాదిగా చూస్తోంది.

"అబ్బా!" నేనూరుకోలేక పోయాను.

"ఎందుకరా అంత కంగారు? కూచో. కూచుని నిదానంగా గుర్తుకు తెచ్చుకో" భుజాలు పట్టి కూచోబెట్టాను.

"య్యా.... యాభైవేలు..." గోపాల్ బిత్తర చూపులు క్యాలెండర్ల మీదున్నై. "ఒకే ఒక కట్ట ఐదొందలనోట్ల కట్ట. బ్యాగులో నా చేతుల్తో నేనే పెట్టుకొని బయల్దేరాను. క్షేమంగా రైలెక్కాను..." ఎమ్మెల్యే ఎలక్షన్లలో చిత్తుగా ఓడిపోయిన కొత్త అభ్యర్థిలా వణికిపోతున్నాడు.

"రైల్లో ఎక్కడన్నా పెట్టి మర్చిపోయారా?" లేదా ఏ దొంగ వెధవన్నా..." రజని వాలకం మంటల్లో మానవుడిలాగుంది.

"నో.... ఎక్కడా పెట్టలేదు. ఎవడూ దొంగిలించలేదు. దర్జాగా సీటుకొరిగి బ్యాగును నా గుండెలకు హత్తుక్కూచున్నాను."

"ప్రయాణం మధ్యలో నిద్రలోకి జారుకున్నారా?"

"లేదు. కంటిమీద రెప్పగూడా వేయలేదు."

"ఓహో గొప్ప! ఎవరి చేతికైనా ఇచ్చి టాయ్‌లెట్ కెళ్ళొచ్చారా?" గొంతు బొంగురు.

"టాయ్‌లెట్ కెళ్ళలేదు. టాయిస్ కొనలేదు. ఫెవికాల్ రుద్దుకున్నట్టు సీటుకే అతుక్కుపోయాను."

"దిగేప్పుడు బ్యాగు చేతుల్లోనే ఉంది?" నేను గూడా ఇంగరాగేషన్‌కు దిగాను.

'దిగేప్పు...డా....ఆఁ... ఉండొచ్చు...."

అగ్గిమీద అడుగేసినట్టైంది నాకు.

"ఉండొచ్చు....చ్చు అంటే ఎలారా? ఉందా లేదా?" ఎంత వద్దనుకున్నా ఆవేశం పాశర్లపూడి బ్లో అవుట్‌లా ఉబికొచ్చింది.

"ఉంది...ఆఁ...అదీ" నీళ్ళు నములాడు.

"ల్లే...ల్లేక... పోవచ్చు గూడా" మందలిస్తున్న మాస్టారు ముందు ఆ రోజే బడికొచ్చిన బాల విద్యార్థిలాగైపోయాడు.

"కాదు... ఉండొచ్చు. అం...టే ఆఫీసర్ ముందు లీవ్‌లెటర్ రాసేప్పుడెక్కడుం దబ్బా...! ఉహుఁ! ల్లే... ఉం... ఏమోరా!" జుట్టు పీక్కునే కార్యక్రమములో చేతులు రెండూ పోటీ పడుతున్నై.

"అలా జుట్టు పీక్కుంటే బోడి గుండైపోతావు తప్ప బోడి డబ్బు తరిగి రాదురా, కాస్త నిదానంగా గుర్తు చేసుకో గాపాల్!" సంయమనమే శరణ్యమనుకున్నాను.

"యాభైవేల రూపాయల కట్టంటే యాభై పైసల బిళ్ళ అనుకున్నారా!" రజని మొహం రాగరంజితమైంది. కోపతాపాలు కరిగి దుఃఖంగా రూపాంతరం చెంది కళ్ళల్లో కరిగి నీరై ముత్తాల్లా రాలి పడుతున్నై.

"ఇప్పుడేం చేయ్యాలన్నయ్యా!" నా గుండెల మీద ఒరుగుతూ బావురుమంది.

అల్లారు ముద్దుగా నా కళ్ల ముందు పెరిగిన రజని బిక్కజచ్చి పోతుంటే పొత్తి కడుపులో దేవినట్లైంది. కాని ధైర్యం చెప్పాల్సిన నేనే దిగాలుపడిపోతే ఎలా? సంభాళించుకోవాల్సిందే.

"అబ్బా... కాస్తాగవమ్మా!" చేతి గుడ్డతో రజని కళ్ళద్దాను. "అలా బెంబేలు పడిపోతే పోయిన డబ్బు తిరిగొస్తుందా?"

"హమ్మో...! యాభైవేల బ్యాగు రైల్లోనే పోయినట్టుందిరా!" గోపాల్ గుండెలు బాదుకున్నాడు. అమ్మానాన్నలిచ్చిన ఒకే ఒక స్థిరాస్తి. వాళ్ళ గుర్తుగా గూడా మిగల్లేదురా. దాన్ని అమ్మడమే పొరపాటైంది. దేవుడా!" రాగాలందుకున్నాడు.

నా బుర్ర నాగపూర్‌రైల్వే జంక్షనైంది. రెండు నిమిషాల్లో నాలుగైదు ఆలోచనలు పరుగెత్తాక అన్యధా శరణం నాస్తి అన్పించింది.

"ఏ రైల్లో వచ్చావో ఆ రైలు నెంబరు చెప్పరా, పోలీస్ రిపోర్టిద్దాం" రజనివైపు చూశాను. నీ అభిప్రాయమేమిన్నట్టు.

"ఎవడన్నా రైలెక్కేముందు దాని నెండరు నోటు చేసుకుంట్రార్రా....!"గోపాల్ రోషం

"ప్లాటు కొందామంటే ఇన్ని పాట్లు ఎదురైతాయనుకోలేదన్నయ్యా, ఇహ మేమీ భూమ్మీద ఉండడ మనవసరమన్నయ్యా!" నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రోదిస్తుంది. నా గుండె గుడగుడలాడింది. "ఓసి పిచ్చి రజనీ! ఈ మాత్రానికే ఇలాగైపోవాలా? డబ్బును మనం సంపాదిస్తాం గాని డబ్బు మనల్ని సంపాదించదు గదా!"

.....ధైర్యం విలోలంబయోయ.. ఠావుల్ దప్పెను. మూర్ఛవచ్చును. దశకు చేరుకుంది పరిస్థితి.

"సార్... లోపలెవరున్నారు సార్!" తలుపు మీద టకటకలు.

అందరి దృష్టి అటు మళ్ళింది... గడపలో నుంచున్నాడో కుర్రాడు. మోకాళ్లపైకి నెక్కరు. పొడవు గీతల పొట్టి షర్టు, ఆకాశాన్ని చూసున్న జట్టు... పన్నెండేళ్ళుండొచ్చు. చేతిలో చిన్నపాటి నల్ల బ్యాగుంది.

"రా నాయనా...నా!" ఆహ్వానించాను.

వామనుడిలా లోపలికొచ్చి వారంటాపీసర్లా మమ్ముల్ని మార్చిమార్చి చూస్తున్నాడు.

కథా నిలయం
శ్రీకాకుళం

"గోపాల్ గారెవరు సార్."

బ్యాగు గోపాల్ కళ్ళల్లో పడింది.

"నేనే... ఈ బ్యాగు నాదే!" అమృత భాండం కంటబడిన గరుత్మంతుడిలా ఎగిరొచ్చి బ్యాగు లాక్కున్నాడు. జిప్ అబగా లాగి నోట్ల కట్ట బయటికి తీశాడు.

మా కళ్ళు జిగేలుమన్నై. రజని మొహం జాజిపూవులా విచ్చుకుని చీకట్లో చందమామలా వెలిగింది.

"అహా! నాదే... ఈ డబ్బునాదే. హమ్మయ్య." నోట్ల కట్టను ముద్దుబెట్టుకుని బ్యాగును గుండెలకు హత్తుకున్నాడు గోపాల్.

కుర్రాడిని దగ్గరకు తీసుకుంది రజని.

"నువ్వెవరు బాబూ? నీకీ బ్యాగు ఎక్కడ దొరికింది నానా?" అడిగింది అల్లారు ముద్దుగా.

"నా పేరు శంకరండి" కుర్రాడు ఖుషీగా నవ్వేశాడు. "నేనూ, నా దోస్తీలిద్దరం కలిసి స్టేషన్ల రైలు డబ్బాలూడ్చి, కూలి పాసింజర్ల నడుక్కుంటామండి. ఇయ్యాల్ల ఖాళీ రైలుడబ్బాల ఇది దొరికింది. దీని జేబుల అడ్రసుంది గదా... వెతుక్కుంటూ పట్టుకొచ్చిన. మీ బ్యాగు మీకు ముట్టింది. గదా! ఇంగ నేం బోతనమ్మా...." వెనుదిరిగాడు. చెయ్యి పట్టి ఆపింది రజని.

"ఇందులో ఇంత డబ్బుందని నీకు తెల్సా శంకర్?" అడిగింది విభ్రాంతి నుండి తేరుకుంటూ.

శంకర్ నవ్వాడు. ఆ నవ్వులో గంగా ప్రవాహం సవ్వడి ఉంది "అడ్రసు బ్యాగు మీదనే ఉంది గదా. దాన్ని మేమెందుకు ఇప్పి చూస్తాం? దాంట్ల ఏముంటే మాకెందు కమ్మా?"

వీడు కుర్రవాడా లేక వెర్రివాడా!

ఇది కలా... నిజామా!

ఇది కలియుగమా లేక కృతయాగమా!

మా ముగ్గురి మనసులు కాస్సేపు మూగవోయినై.

సంతోషం పట్టలేక గోపాల్ ఓ వందనోటు జేబులోంచి తీసి "శంకర్! ఇదుంచుకో, నువ్వు చాలా మంచి క్రురాడివి బాబూ!" చేతిలో ఉంచబోయాడు.

"అమ్మో! పుణ్యాన్ని అమ్ముకుంటే పాపం గదా సార్!" చెయ్యి వెనక్కులాకున్నాడు. ఎంత సముదాయించినా శంకర్ పట్టుదలలో సడలింపులేదు.

"నువ్వెక్కడుంటావ్ శంకర్?" నాలో ఆసక్తి.

"నాకడ్రసు లేద్సార్! రైల్ స్టేషన్ల క్లోక్‌రూం ఉంది గద సార్! దాని పక్కనే ఉంటాం." చేతులు నెక్కరు జేబుల్లో ఉంచుకొని వెనుదిరిగాడు. ఐ.ఏ.ఎస్.ఆఫీసర్లా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

ఆ డబ్బును అప్పుడే సంపాదించుకున్నతంగా సంబరపడి పోయారు గోపాల్ దంపతులు.

ఓ వైపు రిజిస్ట్రేషన్ జరుగుతున్నా మరోవైపు నా మనుసులో. శంకరే కదుల్తున్నాడు.

ఇంటికెళ్లగానే నా శ్రీమతికి చెప్పానీ సంగతి.

ఆవిడ మొహం ముందు ప్రశ్నార్థకమైంది. ఆ తర్వాత ముద్దబంతి పూవులాగైంది. ఏదో గొప్ప ఆలోచనే ఆవిడ బుర్రలో మెరిసినట్టుంది.

"మన పెళ్ళై ఐదేళ్ళైంది గదండీ...." అంటూ నా అరచేతుల్తో తన బుగ్గలు నిమురుకుంది.

"ఔను. మన పెళ్ళికీ ఆ పిల్లాడికీ ఏమిటీ కనెక్షనూ?"

"మనకింకా పిల్లాపాపల్లేరు గదా!"

ఆహా! కనెక్షనందుకుంటుంది. ఇన్నాళ్ళుగా కార్యేశుదాసిగా నిరూపించుకున్న మావిడ కరణేషు మంత్రి అనిపించుకుంటోంది.

"అయి...తే ఆ పిల్లాడిని తెచ్చి పెంచుకుందామా!"

"తప్పేముందటా! డాక్టర్ల పరీక్షల్లో మనకు సంతానయోగం లేదని తేలిపోయింది గదా!"

నిజమే! శంకర్‌ను దత్తత తీసుకుని బాగా చదివిస్తే మెరికలా తయారై నా వంశప్రతిష్ట నినుమడింప జేస్తాడు.

తర్కనితర్కాలకు తావివ్వకుండా ప్రపోజల్ ఓకే అయిపోయింది.

నేనో పత్రికా విలేకరిననీ, ఇదో న్యూసు ఐటమనీ గుర్తుకొచ్చింది.

డ్యూటీ ఈజ్ బ్యూటీ గదా! కెమరా చంకనేసుకుని స్టేషన్‌వైపు పరుగుదీశాను.

క్లోక్‌రూం పక్కన మూడు వైపులా గోడలతో చిన్న సందులాగుంది. తలుపూ తాళాల కాస్కారం లేని ఓపెన్ రూంలో శంకర్‌తోపాటు మరో ఇద్దరు పిల్లలున్నారు. ఇంచుమించు శంకర్ వయసే, శంకర్ నన్ను గుర్తుబట్టాడు.

"రాండ్రిసార్!" చేతులు చాచి పిలిచాడు. న్యూస్ పేపర్ పరిచి ఉన్న నేల మీద కూచోమ్మని సైగచేశాడు.

వినయ మూర్తుల్లా ముగ్గురూ చేతులు కట్టుకు నుంచున్నారు. బాలలు బ్రహ్మ స్వరూపులంటారు గదా! వాళ్ళు త్రిమూర్తుల్లా కన్పించారు.

"మీరూ కూచోండి" అన్నాను, కెమెరా సర్దుకుని కూచుంటూ. గోడ కొరిగి మిగతా ఇద్దరితో నన్ను పరిచయం చేసుకున్నాను. పత్రికా విలేకరి ప్రతాపాన్నంతా మాటల్లో చూపించి వివరాలు సేకరించాను.

పంజరంలో ఇమడలేని పావురాల్లా ముగ్గురూ పాఠశాల విద్యనొదిలేసి ఇళ్ళల్లోంచి పారిపోయి వచ్చినవారే. త్రిమూర్తుల లీలనో. త్రిమాతల మాయనోగాని ముగ్గరూ స్టేషన్లో కలుసుకున్నారు. ఒక్కగూటి పక్షులయ్యారు.

ఒకడు సవతి తల్లి తిట్లు భరించలేక, మరొకడు తాగుబోతు తండ్రి తన్నులకోర్వలే కనట, శంకరేమో చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయాడట. మేనత్త మేనమామలు రాచి రంపాన పెడుతుంటే పారిపోయి వచ్చాడట.

"ఆ బ్యాగు దొరగ్గానే అందులోని డబ్బు తీసుకోలేదెందుకూ? ఆ డబ్బుతో మీ జీవితాలకో దారి దొరికేది గదా!" అడిగాను, ముగ్గురి మొహాలను తేరిపార జూస్తూ. ఆ చిన్నారుల మొహాలు పంచవర్ణ చిత్రాలైనాయి.

"ఛీఛీ... అది దొంగతనం. గా డబ్బు మాకెందుకు సార్?"

"అది... మా సంపాదన కాదు గదా!"

"ఆ పాపం మాకెందుకూ? మేము కష్టనడి సంపాదించుకుంటాం సార్..."

సూటిగా దూసుకొచ్చిన సమాధానాలు కాస్సేపు నన్ను నేను మరిచిపోయేలా చేశాయి.

అరవిరిసిన బాల్యంలో ఆరబోసిన అమాయకత్వం. వాళ్ళ గుండెలోతుల్ని మాటల్తో కొలుస్తూ ఫోటోలు తీశాను.

రైళ్ళ రాకపోకలు, పాసింజర్ల పచార్లు మా సంభాషణకేమీ ఆటంకం కాలేదు.

నా శ్రీమతి ప్రపోజల్ వాళ్ళముందుంచాను. మొహాలు చూసుకుని నవ్వుకున్నారు. వెంటనే ఇద్దరి మొహాలు వాడిపోయిన కలువలైపోయినై.

"మా కష్టంతో మేము బతకాలనుకున్నాం సార్!" అంటూ వాడిన కలువల్ని వాడి చూపులతో పరిశీలించాడు శంకర్.

దంగైపోవడం నా వంతైంది.

"మీరు పిల్లలు..." సముదాయించబోయాను.

"ఐతే యేం సార్? రైలు డబ్బాలూడ్చి సంపాదించిన దాంట్లో కొంత మిగిలించినం. ఈ రోజు నుంచే శంకర్ బూట్‌పాలిష్ చేస్తాడు. బజారుకెళ్ళి ఇప్పుడే సామాన్లు కొనుక్కొచ్చినం." అన్నాడొకడు, దయచేసి మమ్మల్ని విడదీయకండి సార్ అన్నట్లుగా చూస్తూ.

"బూట్ పాలిష్ అడ్డా జమాయించినంక మమ్మల్ని నలుగురు గుర్తుబడ్తారు. గప్పుడు మేమిద్దరం ఇంకేదన్నా పంజేస్తం. మా రెక్కల కష్టమే మాకు ఖుషీసార్" అన్నాడింకొకడు. చెడ్డీ సవరించుకుంటూ.

గుండెతో రాసిన ఈ వార్తను ప్రతికలన్నింటికీ చేర్చాను.

తెల్లారేసరికి - శంకర్ ఫోటోతో సహా బాక్స్ ఐటంగా అచ్చైంది. అదో సెన్సేషనల్ న్యూసై పాఠకుల మనస్సుల్లోకి చొచ్చుకుపోయింది. తోటి జరలిస్టులు నన్ను ప్రశ్నంసల్లో ముంచెత్తారు గూడా.

వార్తాపత్రికలు వాళ్లకు చూపించేందుకు వెళ్ళాను మర్నాడు. శంకర్ బృందం స్టేషన్ ముందే దర్శనమిచ్చింది. శంకర్ బూట్‌పాలిష్ చేస్తున్నాడు. మిగితా ఇద్దరు కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"రాంఁడ్రి సార్ రాంఁడ్రి, బూట్ పాలిష్ చేయించుకుంటారా?" ముందు కొచ్చి ఆహ్వానం పలికాడొకడు.

"ఇయ్యాలనే షురూజేసినం సార్. మీ బాట్లు దుమ్ముదుమ్మై పోయినట్టున్నై సార్!" మరొకడు ఒక చేత్తో నా బూట్లను చూపిస్తూ మరో చేత్తో శంకర్ వైపు చూపాడు. శంకర్ నమస్కారం చేశాడు.

"సరేగాని ముందు ఈ వార్త చూడండి" మా పత్రిక విప్పి బాక్స్ ఐటమ్ చూపించాను.

ముగ్గురొకేసారి చదివేశారు.

పత్రికలో ఫోటో వార్త చూసి ఎగిరి గంతేస్తారనుకున్నాను. నా ఊహ ఉట్టిదైపోయింది. కడిగిన ముత్యాల్లాగున్న ముగ్గురి ముఖ కవళికల్లో ఎలాంటి మార్పు లేదు. ఒక్క క్షణం మొహాలు చూసుకుని పెదాలు విరిచారు. ఇంత మాత్రానికే అంత ఆర్భాటమా అన్నట్టు గున్నాయా చూపులు.

"ముందు పాలిష్ చేయించుకోంఁడ్రి సార్!" శంకర్ సర్దుక్కూచున్నాడు.

ఒకడు నా కాలును బూటు స్టాండు మీదుంచితే మరొకడు చిరునవ్వులు చిందిస్తున్నాడు. శంకర్ తన పనిలో లీనవయ్యాడు.

పేపర్లో పేరు కనబడిందంటే పది పేపర్లు కొని వందమందికి చూపించుకునే ఈ ప్రచారయుగములో వీళ్ళసలు దీన్నో విషయంగానైనా స్వీకరించడము లేదే!

రైలు కూత విన్పించింది.

"మేంబోయి వస్తాంరా... శంకర్!" అంటూ ఇద్దరు కుర్రాళ్ళు స్టేషన్లోకి పరుగుతీశారు.

బిజినెస్ మాగ్నెట్‌గా పేరొందిన మా పత్రికాధిపతి ఆస్తులు వందల కోట్లు దాటి చాలా కాలమైంది. అతనికెన్నో వ్యాపార సంస్థలున్నాయి. ఆ సంస్థల్లో పంజేసే ఉద్యోగుల సంఖ్య వేలల్లో ఉంది. ఫలానా మనిషి నిజాయితీ పరుడని అతని దృష్టికొస్తే చాలు - ఆ శాల్తీ ఎక్కడున్నా వెతికించి పిలిపించి ఉద్యోగమిస్తాడు.

రెండ్రోజుల తర్వాత మా పత్రికాధిపతి ప్రకటన పత్రికలో ప్రత్యక్షమైంది. శంకర్ వెంటనే తనను కలిస్తే మెచ్చిన జీతంతో అతనికి నచ్చిన ఉద్యోగమిస్తానని - దాని సారాంశం, చదివి నాలో నేనే నవ్వుకున్నాను.

మరో రోజు ఇంకో పత్రికలో మరోవార్త - సిరిగమల సరిగమలతో తేలియాడే ఓ కోటీశ్వరుడు ఉద్యోగమిస్తా రమ్మని శంకర్ వద్దకు తన మనిషిని పంపాడని - శంకర్ అది గూడా తిరస్కరించాడనీ.

బాల కార్మికుని కోసం బలవంతుల ఆరాటం. నమ్మకంగా పంజేసే మనిషి కోసం! నలుగురి వెతుకులాట. నా అంతరంగములో సందేహాల కోలాటం...

అలిగి ఇంటి నుండి పారిపొయ్యొచ్చిన అర్భకుడికింత ఇదేమిటో! బూట్ పాలిష్ చెయ్యడంకంటే కాళ్ళముందు కొచ్చిన ఉద్యోగం చేస్తూ కలవిడిగా బతకరాదా! చలికి వణికి పోతూ స్టేషన్లో తిప్పలు పడే కంటే గొప్పగా ఇంట్లో ఉండడం మేలు గదా! క్షణక్షణం ఎదిరి చూసే కంటే నెలకోసారి జీతం డబ్బులందుకుని దొరలా గడపవచ్చు గదా!

ఆఫీసుకెళ్లినా... అలి ముందున్నా ఆవే ఆలోచనలు. శంకర్ ఎందుకిలా ప్రవర్తిస్తు న్నట్టూ! వారం రోజులు గడిచిన ఆసక్తి మరో ఆలోచనకు తావివ్వలేదు. ఇహ ఉండబట్టలేక సాయంత్రం గోపాల్ ఇంటికి పరుగెత్తాను.

రజని చాయ కప్పుతో ఎదురైంది. మెడలో మెరిసే మంగళ సూత్రాలు, జడలో మురిసే సన్నజాజులు, ముక్కుపుడక తళుకులు, పావలా కాసంత ఎర్ర కుంకుంబొట్టు... చెల్లి తల్లిలా కన్పించింది.

కాస్సేపు కమ్మని అనుభూతి.

"ఏరా వచ్చావా! ఆ శంకర్ మళ్ళీ కన్పించాడా? మీ ప్రపోజలేమైందీ?..." ప్రశ్నల వర్షం కురిపించాడు గోపాల్.

ఆ ముగ్గురి కుర్రాళ్ళ గురించి నా ఆలోచనలు, అనుమానాలు అన్నీ కక్కేశాను. సస్పెన్స్ సినిమా చూస్తున్న ప్రేక్షకుడిలా అంతా వింటూ ఆశ్చర్య పోయాడు. ఆ తర్వాత.

"ఈ మాత్రానికే అంత టెన్షనెందుకూ? మనిద్దరం ఇప్పుడే వెళ్ళి తేల్చి పారేద్దాం. పదా!" నా కంటే రెట్టింపు ఉత్సాహంగా లేచి తయారయ్యాడు.

రాత్రి ఎనిమిదైంది. వచ్చీపోయే రైళ్ళతో, జనాల గోలతో రైల్‌స్టేషన్ రంగంపేట జాతరలాగుంది. వెతుకులాట కాస్కారం లేకుండా కుర్రాళ్ళు కన్పించారు.

శంకర్ గిరాకీ దారునితో కబుర్లు చెప్పుకుంటూ బూట్ పాలిష్ చేస్తున్నాడు. ఒకడు రేకు తాంబాళం మెడలో వేళ్ళాడదీసుకుని చాకెట్లు, సిగరెట్లు, పాన్‌లు అమ్ముతున్నాడు. ముగ్గురూ యమబిజీగున్నారు. కూసే గాడిదొచ్చి మేసే గాడిదను చెడగొట్టిందన్నట్టు కారాదని కాంటీన్ కెళ్ళాం. కబుర్లు చెప్పుకుంటూ టీ తాగి తిరిగొచ్చాం.

ముగురూ కలిసి బూట్ పాలిష్ సామానులు సంచీలోకి సర్దుతున్నారు.

"బాగున్నావా శంకర్?" పలుకరించాను.

మూడు జతల కళ్ళు మావైపు తిరిగి తళ్ళుక్కుమన్నాయి.

"బాగున్నాను. మా రూంకు పోదాం రాండ్రిసార్!" సంచీ భుజానికి తగిలించుకున్నాడు శంకర్.

గోపాల్ తనను తాను పరిచయం చేసుకుని "నీ మొబైల్ పాన్‌షాపెలా నడుస్తుందీ?" అడిగాడు.

"కొత్తగదా! అయినా మీ దయవల్ల బాగానే నడుస్తుంది సార్!"

"నేను గూడా మూటలు మొయ్యడం బంద్ జేసి రేపట్నుంచి పత్రికలమ్ముతాను. సార్!" మరొకడి మురిపెం.

స్టేషన్ నుండి కొంత దూరం నడిచి సందులోకి తిరిగాం. గుడిసెలాంటి చిన్నగదిలో ప్రవేశించాం అగ్గిపుల్ల గీసి బుడ్డి దీపం వెలిగించాడొకడు. గోరంతం దీపం కొండంత చీకటిని తరమేసింది. నేలమీద చాప పరిచి ఉంది.

"వంట చేసుకుంటున్నారా?" గోపాల్ చూపులు గదినంతా తడుముతున్నై.

"ఇంకా లేద్సార్! పొద్దున చాయదాగుతం. మధ్యాహ్నం అప్పలమ్మ గుడిశె హోటల్లో అన్నం దింటం. రాత్రికి బన్ను దింటం." అంటూ వెంట దెచ్చిన బన్‌పాకెట్ చూపించాడు.

నా గుండెల్లో గులకరాయి దొర్లింది. గోపాల్ పరిస్థితీ అలాగే ఉన్నట్టుంది.

ఇద్దరం మొహాలు చూసుకున్నాం.

"మేము రైలు ఊడ్చుడు బంద్ జేసినం సార్!" అంటూ కూచొమ్మని సైగ జేశాడు శంకర్.

"పత్రికలో నీ కోసం వచ్చిన ప్రకటన చూశావా శంకర్!" అడిగాను.

"చూసినం సార్!"

"అంత సులువుగా ఉద్యోగం దొరికే అవకాశం వచ్చినప్పుడు ఇలా బతకడం... ఎట్లా ఉంటుందీ?"

"ఇప్పుడు మాకేమైంది సార్? రెక్కల కష్టమ్మీద బతుకున్నాం."

"దీనికంటే ఉద్యోగం నయం గదా!"

ముభావంగా చూశారు. చిరుపెదాల మీద చిరునవ్వులు - ముత్యాల్లా దొర్లాయి. గోపాల్ కేమనిపించిందో.

"మీరు పిచ్చోళ్ళా? చదువుకున్నోళ్ళూ, చదువు రానోళ్ళూ అంతా ఉద్యోగాలు కావాలని దేశమ్మీద పడి తిరుగుతూంటే నువ్విట్లా అంటావెందుకూ?" గుచ్చి అడిగాడు.

"ఒకసారి ఉద్యోగంల చేరితే దానికే అలవాటు పడ్తం గద సార్!"

"ఐతే ఏమవుద్దీ?"

"ఉద్యోగం చేసుకుంట వోతుంటే మా బతుకులు గూడా గొట్టె తోకలైపోతై సార్!" ఒకడన్నాడు.

"అయితే ఏం?" ఆవేశాన్ని తగ్గించుకని వెంటనే సర్దుకుని "దాంట్లోనే బోలెడంత తృప్తి ఉంది గదా!" అన్నాడు.

"దాందేముంది సార్! ఎట్లనుకుంటే గట్లే తృప్తి" మరొకడన్నాడు.

"మరయితే ఇళ్ళల్లోంచి పారిపోయి ఎందుకొచ్చినట్టు?"

"మేము పారిపొయ్యొచ్చింది ధనవంతుల దగ్గర ఉద్యోగాలు చేసేందుక్కాదుసార్?? అనేశాడు శంకర్.

"మరెందుకోసం?"

"మా ఇష్టమొచ్చినట్టు మా బతుకులు మేము బతికేందుకు."

వీళ్ళు పిల్లలా లేక పిచ్చి సన్నాసులా?...

"అంటే...!" నా భృకుటి పీటముడేసుకుంది.

"సార్! మొదట్ల ఉపవాసాలున్నం. అటెన్క రైలుడబ్బా లూడ్చి కడుపునింపు కున్నాం. తర్వాత బూట్ పాలిష్ షురూ జేసినం. ఇప్పుడు పాన్ షాప్ షురువైంది. రేపట్నుంచి పేపర్లమ్ముతున్నం. మూన్నెళ్ళు స్టేసన్ల గడిపినం. ఇప్పుడీ పాక కిరాయికి దీసుకున్నం. గిట్లనే సొంతంగ బతుకుతం సార్!" పాన్‌వాలా గడగడా చెప్పేశాడు.

"ఇంకొకల మోచేతి నీళ్ళు తాగం సార్!"

"ఉంటే తింటం, లేకపెతే పండుకుంటం."

"అయినా ఉపాయమున్నోడు ఉపవాసముంటాడా సార్?"

కుర్రాళ్ళ ఆత్మవిశ్వాసం మా అంతరంగాలను కదిలించింది. వాళ్ళతో వాదించి లాభం లేదని బయటికొచ్చేశాం.

నేరుగా గోపాల్ ఇంటికెళ్ళాం.

రజని బలవంతమ్మీద గోపాల్‌తోపాటు అక్కడే భోం చేశాను. కడుపునిండా భోం చేసినా నాలో ఏదో వెలితి. విషయమంతా రజనికి చెప్పాం.

అంతా విని అంది రజని.

"ఆ పిల్లల విషయంలో ఎవరి స్వార్థం వారు చూసుకుంటున్నారన్నయ్యా!"

ఉలిక్కిపడ్డాను.

"స్వార్థమా? ఏమంటున్నావు రజనీ?"

"కాకపోతే మరేమిటన్నయ్యా? ఆ శంకర్ క్యాషుబ్యాగు తెచ్చిచ్చాడని మేము మా

ఆత్మానందం కోసం వంద రూపాయలిచ్చి చేతులు దులుపుకోవాలనుకున్నాం. మీరు పున్నామ నరకం నుండి తప్పుకునేందుకు వాణ్ణి పెంచి పెద్ద జేసి ప్రతిఫలంగా వాని చేతుల మీదుగా తనువులు చాలించాలనుకున్నారు. నిజాయితీ పరుణ్ని ఉద్యోగంలో పెట్టుకొని మరిన్ని లాభాలు గడించాలని యజమానులు.... అంతా స్వార్థపరులమే గదా అన్నయ్యా! కాని.... వాడూ వాని మిత్రులు మాత్రం నిజాయితీకి చిరునామగా మిగిలారు."

రజని చెప్పిందాంట్లో అణుమాత్రం గూడా అబద్ధం లేదు. నా మనసులోని అల్లకల్లోలం అంతమైంది.

ఇంటికెళ్ళి పడుకునే ముందు నా శ్రీమతి చెవిలో వేశాను.

ఆవిడ తృప్తిగా నిట్టూర్చింది.

"ఆ కుర్రాళ్ళు స్వేచ్ఛా జీవులండీ! వాళ్లే భావి భారత భాగ్యవిధాతలు" అంటూ తాను చూడని కుర్రాళ్ళకు చేతులెత్తికైమోడ్పులర్పించింది.

* * * * *

**జాగృతి వారపత్రిక జూన్ 28 - జూలై 4 మరియు జులై 5-11-1999**

